

తాడిగుడ రోడ్డు మరమ్మతు పనులు

ప్రజాశక్తి–అనంతగిరి: ప్రముఖ పర్యాటక కేంద్రమైన తాడిగుడ జలపాతానికి వెళ్లే రోడ్డు గండి పడటంతో మరమ్మతు పనులు చేపట్టారు.. మండలంలోని కురిసిన మొంథా తుఫాను కారణంగా తాడిగుడ గ్రామ సమీపం వద్ద ఉన్న గెడ్డ ఉధృతి కారణాంగా కోతకు గురైంది. అనంతగిరి మైయిన్ రోడ్డు నుండి పెద్దురు మీదుగా మూడు కిల్లో మీటర్ల దూరం ఉంది. జలపాతానికి వెళ్లే పర్యాటకుల వాహనాలు ముందుకు వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. దీంతో, రోడ్డు పనులు నిర్వహిస్తున్న కాంట్రాక్టర్ ఆదివారం ఆ మార్గాన్ని మరమ్మతు పనులు చేపట్టారు.



చేపడుతున్న రోడ్డు పనులు

అన్ని తరగతులూ ఒకే గదిలో..

- ఒకే చోట 50 మంది విద్యార్థులకు విద్యాబోధన
- బెంచీలు లేక నేలపైనే చదువులు
- పూర్తి కాని మరుగుదొడ్డి

ప్రజాశక్తి–అరకులోయ రూరల్: కార్పొరేట్ బడులకు ధీటుగా ప్రభుత్వ బడులు తీర్చిదిద్దుతామని గొప్పలు చెపుతున్న కూటమి ప్రభుత్వం ఆచరణలో అమలు కావడం లేదు. పికుసుమగూడ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మౌలిక సదుపాయాల కొరతతో కొట్టుమిట్టాడుతున్నాయి.

అరకులోయ మండలం మాడగడ పంచాయతీ కుసుమగూడ గ్రామంలో ఉన్న మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో అదనంగా భవనం లేకపోవడంతో ఒకే గదిలో సుమారు 50 మంది విద్యార్థులు చదువుతున్న దుస్థితి కొనసాగుతోంది. ఈ పాఠశాలలో 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకూ విద్యాబోధన కొనసాగుతున్నాయి.

ప్రతి తరగతికి విడివిడిగా గదులు ఉండాలి, అయితే భవనం లేకపోవడంతో అందరూ ఒకే గదిలో చదువుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. పిల్లలు ఒకే గదిలో బిగుసుకు కూర్చుని చదువుకోవాల్సి వస్తోంది. శబ్దాల మధ్య గురువులు పాఠాలు చెప్పడానికి తీవ్రంగా శ్రమిస్తున్నారు. తరగతి బెంచీలు చాలక నేలపై కూర్చోవాల్సిన పరిస్థితి నెలకొంది. మరొక్క పాత భవనం శిథిలావస్థకు చేరి కూలిపోయే స్థితిలో భవనం ఉంది. మరుగుడొడ్లు కూడా నేటికి పూర్తి చేసిన దాఖలు లేదు. ప్రభుత్వం, విద్యా శాఖ, లేదా స్థానిక నాయకులు ఈ సమస్యను వెంటనే పట్టించుకుని పాఠశాలకు అవసరమైన గదులు, మౌలిక వసతులు కల్పించాలని స్థానికులు కోరుతున్నారు. గత కొన్నేళ్లుగా భవనం కోసం అధికారులు వద్దకు వినతిపత్రాలు పిర్యాదులు చేసిన కానీ ఇప్పటివరకు స్పందన లేదని ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లి తండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం, విద్యా శాఖ అధికారులు స్పందించి పాఠశాలలో మౌలిక వసతులు కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.



నేలపైన కూర్చుని చదువుతున్న విద్యార్థులు



అసంపూర్తిగా నిలిచిన మరుగుదొడ్డి



శిథిలావస్థలో ఉన్న పాత పాఠశాల భవనం



ప్రస్తుత పాఠశాల భవనం

ఆదివాసీ హక్కులు, ఉద్యోగాల సాధనకు పోరుబాట

డిసెంబర్ 15న రంపచోడవరంలో బహిరంగ సభ

ప్రజాశక్తి- గంగవరం: ఆదివాసీ హక్కులు, ఉద్యోగాల సాధనకు పోరుబాట పట్టనున్నట్టు ఆదివాసీ హక్కులు ఉద్యోగాల సాధన కమిటీ నాయకులు స్పష్టం చేశారు. ఈ మేరకు డిసెంబర్ 15న రంపచోడవరంలో బహిరంగ సభ నిర్వహిస్తున్నామని తెలిపారు. గంగవరం మండల కేంద్రంలో ఆదివాసీ హక్కులు ఉద్యోగాల సాధన కమిటీ అధ్యక్షులు ఈతపల్లి సిరిమల్లిరెడ్డి, డివిజన్ అధ్యక్షులు మడి మురళిదొర ఆధ్వర్యంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐదో షెడ్యూల్ ప్రాంతంలో అన్ని ఉద్యోగాలు ఆదివాసీలకే కేటాయించాలనే డిమాండ్‌ను ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు..1/70 చట్టం, పీసా చట్టం, అటవీ హక్కుల చట్టం, 2013 పోలవరం భూసేకరణ చట్టాలు ఇప్పటికీ పటిష్టంగా అమలు కాకుండా అధికారులు ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వం కుట్ర చేస్తున్నారన్నారు. ఐదో షెడ్యూల్డ్ ప్రాంతంలో అన్ని శాఖల్లో ఉద్యోగాలు కేటాయించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఆదివాసీ హక్కులు, చట్టాలు డిమాండ్లను, ఆదివాసీ నిరుద్యోగుల డిమాండ్లకు సంబంధించి డిసెంబర్ 15వ తేదీలోగా సమస్యలు పరిష్కరించాలన్నారు. రంపచోడవరం డివిజన్లో ప్రభుత్వం అక్రమంగా భూములు కొనుగోలు చేసే ప్రక్రియను తక్షణమే నిలిపివేయాలన్నారు. ఈ డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించని పక్షంలో పోరుబాటలో తేల్చుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో మద్దేటి అంజిరెడ్డి, కత్రం దాసు కోయ, వెదుళ్ళ లచ్చిరెడ్డి, తెల్లం శేఖర్, తాము సూరిబాబు, వంతు బాలకృష్ణ, పండా కృష్ణమూర్తి దొర, కుంజం తమన్న దొర తదితరులు పాల్గొన్నారు



అభివాదం చేస్తున్న ఉద్యోగాల సాధన కమిటీ నాయకులు

కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలి

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట్

ప్రజాశక్తి -కూనవరం : ప్రభుత్వ రంగ కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్ డిమాండ్ చేశారు. సిఐటియు కూనవరం మండల 9వ మహాసభ కోతులగుట్టలో తాళ్లూరి శ్రీనివాసరావు, కారం సుజాత, కొమరం రామకృష్ణ అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. కార్యక్రమంలో సీనియర్ సభ్యులు కాపుల నాగేశ్వరావు జెండా ఆవిష్కరించారు. అనంతరం మండల కమిటీని ఎన్నుకున్నారు. మండల కన్వీనర్‌గా పాయం సీతారామయ్య, కో కన్వీనర్‌గా కొమరం రామకృష్ణని ఎన్నుకున్నారు. మరో 25 మందిని సభ్యులగా ఎన్నుకున్నారు. సిఐటియు జిల్లా కార్యదర్శి పల్లపు వెంకట్ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు బడా పెట్టుబడిదారులకు రాయితీ బ్యాంకులు తీసుకున్న వారికి రుణాలు సహకరిస్తున్నాయి కానీ ప్రభుత్వ రంగంలో పనిచేస్తున్న కార్మికులకు కనీసం వేతనం పెంచడం లేదన్నారు. స్కీం వర్కర్లు ప్రభుత్వ ఉద్యోగులకు సమానంగా పనిచేస్తున్నా కనీసం వేతనాలు పెంచడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని రంగాలు కార్మికులందరినీ ఐక్యం చేసి కనీస వేతనాలు సాధించే వరకూ పోరాటం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు రాజేశ్వరి, మండల నాయకులు కొమరం పెంటయ్య, లక్ష్మి ప్రసన్న, మణి,మడకం భద్రమ్మ కూర రజిని కామేశ్వరరావు సందీప్ పాల్గొన్నారు



మాట్లాడుతున్న సిఐటియు జిల్లా కార్యదర్శి పల్లపు వెంకట్

శివశంకర్‌ను కలిసిన బుచ్చిబాబు

ప్రజాశక్తి - చింతపల్లి : జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాస్మి చైర్మన్ తమ్మిరెడ్డి శివశంకర్ జన్మదినం సందర్భంగా చింతపల్లి మండల పార్టీ అధ్యక్షులు వంతల బుజ్జిబాబు ఆయనను కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. శివశంకర్ మరెన్నో జన్మదిన వేడుకలు జరుపుకోవాలని ఆకాంక్షించారు.



వైద్య ఉద్యోగులు ఐక్యంగా పోరాడాలి



మాట్లాడుతున్న నాగరాజు

ప్రజాశక్తి -పాడేరు: జిల్లాలోని వైద్య ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఐక్య పోరాటం చేయాలని గిరిజన ప్రాంత వైద్యరోగ్య ఉద్యోగులు సంఘం జిల్లా కమిటీ సంఘం అధ్యక్షులు శెట్టి నాగరాజు పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రం పాడేరులో ఆదివారం జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు.. ఈ సమావేశాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ, గిరిజన ప్రాంతంలో వైద్య ఆరోగ్యశాఖలో రెగ్యులర్ ఉద్యోగులు అనేక సమస్యలతో బాధపడుతున్నారని, మండలాల వారిగా ఆ సమస్యలను సేకరించి అధికారులు దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేయవలసి ఉందన్నారు. ఆ దిశగా యూనియన్ ఆలోచన చేస్తుందని చెప్పారు, రానున్న రోజుల్లో అన్ని మండలాల ఉద్యోగస్తులను కలిసి ఉద్యోగపరమైన, విధి నిర్వహణలో క్షేత్రపరమైన ఎదురవుతున్న సమస్యలను సేకరించి వాటి పరిష్కారానికి సంఘం కృషి చేస్తుందన్నారు. గిరిజన ప్రాంతంలోని ఉద్యోగుల సంఘం ఆరోగ్యశాఖలోని అన్ని కేడర్ల ఉద్యోగులతో కమిటీ ఏర్పాటు చేయడానికి జిల్లా కమిటీలో చర్చించడం కోసం ఈ సమావేశం ఏర్పాటు చేసినట్లు ఆయన చెప్పారు. రెగ్యులర్ ఉద్యోగుల సర్వీస్ రిజిస్టర్ల అప్డేట్, ఇంక్రిమెంట్, ఫీల్డ్ ట్రావెలింగ్, యూనిఫామ్ ఎలవేన్స్, ప్రమోషన్స్, అధికారుల వేధింపులు, మొదలగు వాటిపై మండలాల వారిగా వివరాలు సేకరించి అధికారులు దృష్టికి తీసుకెళ్తామని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో 11 మండలాల నుండి మండల అధ్యక్ష కార్యదర్శులు పడాల్, దేవి నాయూడు, సత్యనారాయణ, మురళి, మచ్చ లింగం నాయుడు, మోహన్‌రావు, రాము, చిన్నా రావు, నాగరాజు, మిగతా నాయకులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలపై పోరాటం : ఎస్ఎఫ్ఐ



మహాసభకు హాజరైన నాయకులు, విద్యార్థులు

ప్రజాశక్తి–జి.మాడుగుల: మండలంలో ఎస్ఎఫ్ఐ మండల మహాసభ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అల్లూరి జిల్లా ఎస్ఎఫ్ఐ అధ్యక్షులు కార్తీక్ శ్రీను విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, విద్యార్థి దశ నుంచి మనం మంచి నాయకులుగా ఎదగాలన్నారు. ప్రజల పక్షాన పోరాడాలన్నారు. విద్యార్థులను చీకటి నుండి వెలుగులోకి నడిపించే మంచి నాయకులుగా ఎస్ఎఫ్ఐ లీడర్స్ ఉండాలని తెలియజేశారు. విద్యార్థులకు ప్రభుత్వం ఇచ్చే పథకాలు అందేలా పోరాడాలన్నారు. విద్యారంగంలో ఉన్న సమస్యల కోసం రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలతో పోరాడుతూ విద్యార్థి సమస్యలను పరిష్కరించాలని పిలుపునిచ్చారు.విద్యార్థి చట్టాలను, హక్కులపై పోరాటం చేయాలన్నారు. ఎస్ఎఫ్ఐ నాయకులుగా ఉండే మనం విద్యార్థుల పక్షాన పోరాటం చేయాలన్నారు.

మండల మహాసభలో నూతనంగా కమిటీ ఎన్నికైంది. మండల అధ్యక్షులుగా కిల్లో. దేవరాం, మండల కార్యదర్శిగా కిల్లుడు. ప్రభాస్, సహాయ కార్యదర్శిగా ప్రదీప్, మండల ఉపాధ్యక్షులుగా మధు, 20 మంది మండల కమిటీ సభ్యులు ఎన్నికయ్యారు.ఈ కార్యక్రమంలో విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

పెరుగుతున్న చలి తీవ్రత

ప్రజాశక్తి–అరకులోయ: పర్యాటక కేంద్రమైన అరకులోయ ప్రాంతంలో చలి తీవ్రత పెరిగింది. మొంథా తుఫాను తగ్గుముఖం పట్టడంతో చలి తీవ్రత అధికమైందని స్థానికులు అభిప్రాయ పడుతున్నారు. గత మూడు రోజుల నుంచి చలి గజగజ వణికిస్తుంది. అరకు,అనంతగిరి ఘాట్రోడ్లో మధ్యాహ్నం రెండు నుంచే దట్టమైన పొగ మంచు అమ్ముకుంటుంది. దీంతో వాహన రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుందని వాహన చోదకులు అంటున్నారు. అలాగే ఉదయం తెల్లవారుజాము నుంచి 9 గంటల వరకు మంచు వీడక పోవడంతో వాహన చోదకులు లైట్లు వేసుకొని వెళ్లవలసిన పరిస్థితి ఏర్పడింది. ఈ ఏడాది చలి తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉంటుందని స్థానికులు అంటున్నారు. పర్యాటకులకు మాత్రం మంచు అందాలకు కట్టి పడేస్తున్నాయి. దీంతో అరకులో వచ్చిన పర్యాటకులు తెల్లవారుజామునే బయటకు వచ్చి మంచు అందాలను వీక్షిస్తున్నారు.



అరకులోయలో చలిలో వెళుతున్న వాహనాలు



ఏర్పాట్లు పరిశీలిస్తున్న పిఒ స్మరణ్‌రాజ్

3 నుంచి ఏకలవ్య పాఠశాలల్లో కల్చరల్ ఫెస్ట్

ప్రజాశక్తి -మారేడుమిల్లి: ఈ నెల మూడో తేదీ నుంచి ఐదో తేదీ వరకూ మారేడుమిల్లి ఇఆర్ఎంఎస్ పాఠశాలలో రాష్ట్రస్థాయి ఇఆర్ఎంఎస్ రెసిడెన్షియల్ పాఠశాలల కల్చరల్ ఫెస్ట్ నిర్వహించడం జరుగుతుందని రంపచోడవరం ఐటిడిఎ పిఒ బి.స్మరణ్‌రాజ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలకు సంబంధించిన కళాఉత్సవ్–2025 ఈ సంవత్సరం అల్లూరి సీతారామరాజు జిల్లా, మారేడుమిల్లి ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో ఈ నెల మూడో తారీకు నుండి ఐదో తారీకు వరకు కల్చరల్ కాంపిటీషన్స్, కల్చరల్ ప్రోగ్రామ్స్ నిర్వహిస్తారని అదేవిధంగా ఈ కార్యక్రమానికి మంత్రి, శాసనసభ్యులకు, శాసనమండలి సభ్యులకు, జిల్లా పరిషత్ చైర్మన్‌కు, వివిధ శాఖలకు సంబంధించిన అధికారులకు, స్థానిక ప్రజాప్రతినిధులను ఆహ్వానించడం జరిగిందని ఆయన తెలిపారు. మూడు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. గురుకులాల జాయింట్ సెక్రెటరీ ప్రసాద్, గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రుక్మాండయ్య, ఇ ఆర్ఎంఎస్ ప్రిన్సిపాల్ శంకర్ ప్రసాద్, తహశీల్దార్ బాలాజీ, ఎంపిడిఒ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

చింతూరు ఎఎస్‌పిగా బొడ్డు హేమంత్

ప్రజాశక్తి - చింతూరు: చింతూరు ఎఎస్‌పిగా బొడ్డు హేమంత్ నియమితుల య్యారు. రాష్ట్ర ప్రభుత్వం శనివారం ఉత్తర్వులను జారీ చేసింది. ఇప్పటి వరకు ఇక్కడ ఎఎస్‌పిగా పని చేసిన పంకజ్‌కుమార్‌మీనా అల్లూరి జిల్లా అడిషనల్ ఎస్పీ (ఆపరేషన్స్)గా పదోన్నతిపై బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో హేమంత్ నియమితులయ్యారు.



నివాళులర్పిస్తున్న మాధవి తదితరులు

జెడ్‌పిటిసి నూకరాజుకు నివాళి

ప్రజాశక్తి - కొయ్యూరు: జెడ్‌పిటిసి నూకరాజు మృతికి పలువురు సంతాపం తెలిపారు. ఆదివారం చిట్టెంపాడులో నూకరాజు సంతాప సభలో జిల్లా ప్రజాప్రతినిధులతో కలిసి మాజీ అరకు ఎంపి గొడ్డేటి మాధవి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యంగా ఉండాలని ఓదార్చారు. వైసిపి తరపున మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ నూకరాజు కుటుంబ సభ్యులను ఓదార్చుతూ రూ.5లక్షల చెక్కు అందజేశారు. కార్యక్రమంలో అరకు ఎంపి గుమ్మ తనుజరాణి, పాడేరు ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు, అరకు ఎమ్మెల్యే మత్స్యలింగం, మాజీ పాడేరు ఎమ్మెల్యే కొట్ట గుల్లి భాగ్యలక్ష్మి . ఎంపిపి బడుగు రమేష్, వైస్ ఎంపిపి అంబటి నూకాలమ్మ. జడ్పిటిసిలు,ఎంపీపీలు,సర్పంచులు,ఎంపీటీసీలు పాల్గొన్నారు.

గంజాయి విక్రయిస్తే కఠినచర్యలు

ప్రజాశక్తి - కొయ్యూరు : గంజాయి సాగు, రవాణా చేయడం లాంటి అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని కొయ్యూరు సిఐ శ్రీనివాసరావు ప్రజలకు సూచించారు. ఆదివారం మంప ఎస్సై శంకరరావుతో కలిసి రాజేంద్రపాలెం వారపు సంతలో పర్యటించారు. సంతకు వచ్చిన మారుమూల గ్రామాల గిరిజనులతో సమావేశమయ్యారు. గంజాయి సాగు, రవాణా చేయడం చట్టరీత్యా పెద్ద నేరమని చెప్పారు. గంజాయి వల్ల ఎన్నో జీవితాలు నాశనం అవుతున్నాయన్నారు. గంజాయికి దూరంగా ఉండాలని హితవు పలికారు.

రాజవొమ్మంగి: గంజాయి వలన కలిగే, అనర్థాలు, నష్టాలు గూర్చి ఎస్సై శివకుమార్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. స్థానిక గురుకుల, గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో విద్యార్థినులకు అవగాహన కల్పించారు. గృహాల్లో చదువుతున్న విద్యార్థులతో ఎస్ఐ శివకుమార్ మాట్లాడారు. గంజాయి క్రయ విక్రయాల వలన వాటికి సహకరించడం వలన జరిగే పర్యవసానాలపై వివరించారు. సైబర్ నేరాలు మహిళలు భద్రత, తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రిన్స్‌పల్స్ సత్యవేణి,నాగ సుశీల పాఠశాలల సిబ్బంది, పోలీస్ సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కొయ్యూరు సిఐ శ్రీనివాసరావు

బోరు వేశారు....మోటారు మరిచారు..

ప్రజాశక్తి - జికె వీధి: మండలంలోని రింతాడ పంచాయతీ ఈదులబంద గ్రామంలో గ్రామీణ నీటిపారుదల శాఖ, పంచాయతీరాజ్ శాఖ అధికారులు గత ఆరు నెలల క్రితం మంచినీటి బోరు నిర్మించి మోటర్ వేయటం మరిచారని వైసిపి మండల కార్యదర్శి, వైసిపి జికె వీధి సోషల్ మీడియా అధ్యక్షులు పాతున లక్ష్మణ రావు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుఫాను కారణంగా ఈదుల బంద గ్రామంలో తాగునీటి సమస్యతో గ్రామస్తులు ఇబ్బంది పడుతున్నారని అధికారులు స్పందించి బోరుకు మోటారు అమర్చి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.



మోటారు వేయని బోరు

ముగిసిన విజిలెన్స్ అవగాహన

ప్రజాశక్తి -సీలేరు: జీకే వీధి మండలం సీలేరులో 27 నుంచి జరుగుతున్న విజిలెన్స్ అవగాహన కార్యక్రమం ఆదివారంతో ముగిసింది. విజిలెన్స్ విభాగం సీలేరు ఎపి జెన్కో సెక్యూరిటీ ఇన్‌చార్జి కోటేశ్వరరావు ఆధ్వర్యంలో ఆదివారం ఎపి జెన్కో సెక్యూరిటీ కార్యాలయం నుంచి ప్రారంభించి పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ముగింపు కార్యక్రమాన్ని ఉద్దేశించి కోటేశ్వరరావు మాట్లాడుతూ విధి నిర్వహణలో అవినీతికి తావు లేకుండా బాధ్యతాయుతంగా విధులు చేపడుతూ జెన్కో ఆస్తులు కాపాడే బాధ్యత తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సెక్యూరిటీ హెడ్ కానిస్టేబుల్ చంద్రశేఖర్ సిబ్బంది పాల్గొన్నారు



సీలేరు: ఎపి జెన్కో భద్రతా సిబ్బంది ర్యాలీ



జలపాతం నుంచి జాలు వారుతున్న నీరు

మైమరిపిస్తున్న జలపాతాలు

ప్రజాశక్తి- అరకులోయ: పర్యాటక కేంద్రమైన అరకులోయ- అనంతగిరి ఘాట్ రోడ్డులో జలపాతాలు మైమరిపిస్తున్నాయి. మొంథా తుఫానుతో అరకులోయ సమీపంలోని సుంకర మెట్ట మొదలుకొని, యు పాయింట్, కాపి తోట, బీసుపురం, తదితర ప్రాంతాల్లో వరుసగా కొండ పై భాగం నుంచి వర్షపు నీరు జారు వచ్చి జల పాతాలను తలపింప చేస్తుంది. రోడ్డుకు ఆనుకొని కొండలు ఉండడం, అందులో నుంచి జలపాతాలు మాదిరిగా నీరు ప్రవహిస్తుండడంతో పర్యాటకులను చూపరులను అమితంగా ఆకట్టుకుంటుంది. వారం రోజుల నుంచి అరకులోయకు వస్తున్న పర్యాటకులు ఈ జలపాతం అందాలు చూసి మంత్ర ముగ్ధులవుతున్నారు. కటికీ వాటర్ పాల్‌ను తలపించే విధంగా ఎక్కడపడితే అక్కడ ఇటువంటి అందమైన దృశ్యాలు దర్శనమిస్తుండడంతో పర్యాటకులు, ఆనందానికి అవధులు లేకుండా పోయింది. దీంతో ఫోటోలు తీసుకోవడానికి ఎగబడుతున్నారు.

యువ దర్శకుడు రామ్‌జగదీష్‌తో 7న ముఖాముఖి

ప్రజాశక్తి- సీతమ్మధార : ఇటీవల తక్కువ బడ్జెట్‌తో సామాజిక బాధ్యతతో రూపొందించి మంచి విజయాన్ని సొంతం చేసుకున్న కోర్టు తెలుగు సినిమా యువ దర్శకుడు విశాఖ వాసి రాంజగదీష్‌తో వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యాన ఈ నెల 7వ తేదీన ముఖాముఖి నిర్వహించనున్నట్లు సొసైటీ కార్యదర్శి నరవ ప్రకాశరావు తెలిపారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను పౌర గ్రంథాలయంలో ఆదివారం నరవ ప్రకాశరావు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో హుస్సేన్, డాక్టర్ బాబ్జి, ప్రభు, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చిన్నయ్యపడాల్

కాఫీ కార్మికుల సమస్యలను పరిష్కరించకుంటే..

6 నుంచి సమ్మె : సిఐటియు

ప్రజాశక్తి - చింతపల్లి: కాఫీ తోటల కార్మికుల సమస్యల సమస్యలను పరిష్కరించకుంటే ఈనెల 6 నుంచి సమ్మె తప్పదనిప్రభుత్వాన్ని, ఎపిఎఫ్‌డిసి యాజమాన్యాన్ని సిఐటియు జిల్లా అధ్యక్షులు బోనంగి చిన్నయ్య పడాల్ హెచ్చరించారు. ఆదివారం చింతపల్లి మండలం కొత్తపాలెం పంచాయతీ ఎపిఎఫ్‌డిసి కిన్నెర్ల కాఫీ తోటలో పనిచేస్తున్న కార్మికులతో కలిసి మాట్లాడుతూ, కార్మికుల వేతనాలు పెంపు, ప్రస్తుత మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా పండ్ల ధరలు పెరుగుదలపై సమ్మె నోటీసులిచ్చి 20 రోజులు గడిచినా ప్రభుత్వం, యాజమాన్యాలు స్పందించకపోవడం దారుణమన్నారు. ఎపిఎఫ్‌డిసి యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగా కాఫీ తోటలు నాశనమవుతున్నాయని, సంరక్షణకు అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో హెల్పర్ బాలకృష్ణ, కార్మికులు రాములమ్మ, లక్ష్మి, సుబ్బమ్మ, రోహిణి, రామారావు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

'తిమిరాన్ని తరిమేస్తాం' కవితా సంకలనం ఆవిష్కరణ

- ఎవి.రమణరావు, నూనెల శ్రీనివాసరావులకు నివాళి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : సాహితీ స్రవంతి విశాఖ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రూపొందించిన 'తిమిరాన్ని తరిమేస్తాం' కవితా సంకలనం ఆవిష్కరణ సభ ఆదివారం అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో ఉత్సాహపూరిత వాతావరణంలో జరిగింది. సాహితీ స్రవంతి విశాఖ జిల్లా అధ్యక్షులు పొలమరశెట్టి ఫ్రాన్సిస్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో 'సాహిత్య ప్రస్థానం' మాసపత్రిక మేనేజర్, మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ కవితా సంకలనాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సంకలనంలో భాగమైన కీర్తిశేషులు ఎవి.రమణరావు, నూనెల శ్రీనివాసరావుల సంస్మరణ సభలో ఈ పుస్తకాన్ని అవిష్కరించడం వారికిచ్చే గొప్ప నివాళి అని పేర్కొన్నారు. 'సాహిత్య ప్రస్థానం' మాసపత్రిక వర్కింగ్ ప్రెసిడెంట్ సత్యాజీ ఈ సంకలనంలోని కవితలను భిన్న కోణాల్లో విశ్లేషించి, వివరించారు. ఎవి.రమణరావు, నూనెల శ్రీనివాసరావుల ప్రస్థానాన్ని, సాహిత్య రంగంలో వారు అందించిన సేవలను కొనియాడారు. ప్రముఖ రాజకీయ విశ్లేషకులు, 'సాహిత్య ప్రస్థానం' మాసపత్రిక ప్రధాన సంపాదకులు తెలకపల్లి రవి విశాఖ కవులను ఉద్దేశిస్తూ విలువైన సూచనలు, సలహాలు అందించారు. సాహితీ స్రవంతి రాష్ట్ర ఉపాధ్యక్షులు చీకటి దివాకర్, అభ్యుదయ రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి ఉప్పల అప్పలరాజు, విశాఖ రచయితల సంఘం అధ్యక్షులు అడపా రామకృష్ణ, ప్రముఖ నటులు, దర్శకులు చలసాని కృష్ణ ప్రసాద్‌తో పాటు పలు సాహితీ, కళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. సాహితీ స్రవంతి విశాఖ జిల్లా కన్వీనర్ పెంటకోట రామారావు, కోశాధికారి జి.సుబ్బరాజు, జివిఎన్.చలపతి, కె.స్వతంత్ర కుమార్‌లను సత్కరించారు.

7న రెడ్ షర్ట్ వాలంటీర్ల కవాతును జయప్రదం చేయండి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఈ నెల 7న విశాఖ నగరంలో ఉదయం 10 గంటలకు సరస్వతీ పార్క్ నుంచి జివిఎంసి గాంధీ విగ్రహం వరకు సిఐటియు ఆధ్వర్యంలో రెడ్ షర్ట్ వాలంటీర్ల కవాతు జరుగుతుందని సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రదర్శనలో సిఐటియు అనుబంధ సంఘాల కార్మికులందరూ రెడ్ షర్టు, రెడ్ శారీలతో పాల్గొనాలని కోరారు. సిఐటియు 18వ అఖిలభారత మహాసభలు మొట్టమొదటిసారిగా విశాఖ నగరంలో డిసెంబర్ 31 నుంచి జనవరి 4 వరకు జరుగుతున్నాయన్నారు. దేశం నలుమూలల నుండి 1500 మంది ప్రతినిధులు హాజరవుతారని తెలిపారు. ఈ నెల 7న 'రెడ్ షర్ట్ వాలంటీర్ల కవాతు' జరుగుతుందని తెలిపారు.

భక్తుల మృతి కారకులపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గ వెంకటేశ్వర ఆలయంలో జరిగిన తొక్కిసలాటలో తొమ్మిది మంది మృతి చెందడం అనేకమంది తీవ్రంగా గాయపడడం తీవ్ర బాధాకరమని భారత నాస్తిక సమాజం రాష్ట్ర నాయకులు జె.రవి, టి.శ్రీరామమూర్తి పేర్కొంటూ ఆదివారం ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. ఈ మధ్యనే హరిముకుంద పండా అనే వ్యక్తి నిర్మించిన ఈ ప్రైవేట్ ఆలయంలో సరైన బారికేడ్లు లేకపోవడం, రాకపోకలకు ఒకే మార్గాన్ని నిర్మించడం, భద్రతా సిబ్బంది, వాలంటీర్లు లేకపోవడం, నిర్వాహకుల నిర్లక్ష్యం వంటి అంశాలు మీడియా ద్వారా తెలిసాయని పేర్కొన్నారు. మృతి చెందిన ప్రతి వ్యక్తి కుటుంబానికి రూ.25 లక్షలు, తీవ్రంగా గాయపడిన బాధితులకు రూ.10 లక్షలను నష్ట పరిహారంగా నిర్వాహకుల నుండి ప్రభుత్వం ఇప్పించాలని డిమాండ్ చేశారు. అదే విధంగా భవిష్యత్తులో ఇటువంటి సంఘటనలు జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

నేడు హరనాథ్ సంస్మరణ సభ

ప్రజాశక్తి -మాధవధార : ఇటీవల మృతిచెందిన ప్రముఖ న్యాయవాది నాగిరెడ్డి హరనాథ్ సంస్మరణ సభ సోమవారం కంచరపాలెంలోని కాయితి పైడయ్య కల్యాణ మండపంలో జరుగనుందని కుటుంబ సభ్యులు తెలిపారు. హరనాథ్ విద్యార్థి దశలో ఎస్‌ఎఫ్‌ఐ, డివైఎఫ్‌ఐలలో చురుకుగా పనిచేశారు. కంచరపాలెం ప్రాంతంలో యువజన సంఘాన్ని ఏర్పాటుచేసి ప్రజా సమస్యలపై పోరాటాలు నిర్వహించారు. కంచరపాలెం ప్రాంతంలో ఉన్న విఆర్ చిట్స్ బాధితులకు అండగా పలు న్యాయ సూచనలు ఉచితంగా అందించారు. హరనాథ్ సంస్మరణ సభకు సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్, ఐద్వా నాయకులు బి.పద్మ, మాజీ కార్పొరేటర్ బి.ఈశ్వరమ్మ తదితరులు హాజరుకానున్నారు.

వెంటాడుతున్న రాకపోకల కష్టాలు

- ఉధృతంగా ప్రవహిస్తున్న గెడ్డలతో ఇబ్బందులు

ప్రజాశక్తి-చింతపల్లి: మొంథా తుపాన్ వెలిసిపోయినా, దాని ప్రభావంతో రవాణా, ఇతరత్రా కష్టాలు వెంటాడుతూనే ఉన్నాయి. మండలంలోని ఎర్రబొమ్మలు పంచాయతీ ఎర్నాపల్లి గ్రామ ప్రజలు నేటికీ రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తుఫాన్ ప్రభావంతో కురిస్ని వర్షాలకు గ్రామ పరిసరాల్లోని రెండు వాగులు పొంగిపోర్లడంతో రవాణా పూర్తిగా స్తంభించింది. గ్రామ ప్రజలు నిత్యావసర సరుకులు కొనుగోలు చేసేందుకు మార్కెట్‌కు వెళ్ళాలనుకున్నా మార్గమధ్యలో ఉన్న వాగులు దాటి వెళ్లక తప్పని పరిస్థితి ఉంది. తుపాన్ వెలిసిపోయి, నాలుగు రోజులు గడిచినా నేటికీ వాగుల్లో ప్రవాహ ఉధృతి తగ్గకపోవడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఎర్రవరం నుండి వాటర్‌ఫాల్స్ వరకు ఒక కిలోమీటరు దూరం, మరోవైపు ఎర్నాపల్లి నుండి వాటర్‌ఫాల్స్ వరకు మరో రెండు కిలోమీటర్లు దూరం మొత్తంగా మూడు కిలోమీటర్ల పరిధిలో రవాణా అంతరాయం ఏర్పడింది. ఈ నేపథ్యంలో ఎర్నాపల్లి గ్రామ ప్రజలు బాధలను ప్రభుత్వం అర్థం చేసుకుని, తక్షణమే గ్రామానికి నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలని, శాశ్వత పరిష్కారంగా వాగులపై వంతెనలను నిర్మించాలని కోరుతున్నారు.



గెడ్డ నీటిలో దిగి వెళ్లేందుకు అవస్థలు పడుతున్న ప్రజలు

వైసిపి నేతలు శవరాజకీయాలు మానుకోవాలి

- జిసిసి చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న కిడారి శ్రావణ్‌కుమార్

ప్రజాశక్తి -పాడేరు : శ్రీకాకుళం జిల్లా పలాస మండలం కాశీబుగ్గలో తొక్కిసలాటతో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు స్థైర్యాన్ని సానుభూతిని కల్పించవలసింది పోయి దానిని వైసీపీ పార్టీ నాయకులు శవ రాజకీయాలు చేయడం దురదృష్టకరమని అరకు పార్లమెంట్ అధ్యక్షులు, మాజీ మంత్రి, రాష్ట్ర జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్ విమర్శించారు. జిల్లా కేంద్రంలో పార్టీ కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్తీకమాసం కావడంతో భక్తులందరు దైవ దర్శనం కోసం అధిక సంఖ్యలో వెళ్ళటంతో తొక్కిసలాట జరిగి భక్తులు మరణించడం తీవ్ర దిగ్భ్రాంతి కరమన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి బాధిత కుటుంబాలను పరామర్శించడం, ఓదార్చడం కుటుంబాలను ఆదుకొనే కార్యక్రమం చేస్తుంటే ప్రభుత్వంపై నిందలు మోపడం సరికాదన్నారు. వైసీపీ పార్టీకి చిత్తశుద్ధి ఉంటే బాధిత కుటుంబాలకు భరోసా ఇచ్చి ధైర్యం ఇవ్వాలని శవరాజకీయాలు మానుకోవాలని అన్నారు. ఇప్పటికే రాష్ట్ర కేంద్ర మంత్రులు నారా లోకేష్, కింజరాపు రామ్మోహన్ నాయుడు బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని చెప్పారన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్టి కమిషన్ సభ్యులు కిల్లో సాయిరాం, టీడీపీ అధికార ప్రతినిధి, బాకూరు సర్పంచ్ బాకూరు వెంకటరమణ రాజు, మాజీ జడ్పీటీసీ సాగర సుబ్బారావు, దారెలా సర్పంచ్ పాంగి పాండురంగ స్వామి, శోభకోట సర్పంచ్ పలాసి శశి భూషణం నాయుడు, మాజీ సర్పంచ్ వంతల పూర్ణ,టీడీపీ మహిళ ప్రధాన కార్యదర్శి కిముడు మహేశ్వరీ, క్లస్టర్ ఇంచార్జి త్రినాధ్, అరకు అసెంబ్లీ తెలుగు యువత ఆర్గనైజషన్ సెక్రటరీ దన్నయిక రమేష్, నాయకులు చట్టు అప్పలరాజు, సోనారి కామేష్, బుక్క రాజేంద్ర, రాజు పాల్గొన్నారు.

అదాని సిమెంట్ అనుమతులు రద్దు చేయాలి

ప్రజాశక్తి -గాజువాక : అదాని అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీ అనుమతులు రద్దుచేయాలని కోరుతూ వార్వా, నివాస్ ఆధ్వర్యంలో జివిఎంసి 70వ వార్డు పరిధి తోకాడ సమైక్య అపార్ట్‌మెంట్‌లో ఆదివారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా అపార్ట్‌మెంట్ మహిళలు కూడా కరపత్రాలు పట్టుకొని 'ఈ ఫ్యాక్టరీ మాకొద్దు' అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ కార్యదర్శి శ్రీనివాస్ చౌదరి మాట్లాడుతూ, జనవాసాల మధ్య ఫ్యాక్టరీ నిర్మాణం జరిగితే, ప్రజల అనారోగ్యాలకు గురవుతారన్నారు. వార్వా, నివాస్ అధ్యక్షులు బి.ఎ.త్రినాధస్వామి మాట్లాడుతూ, స్థానిక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు జోక్యం చేసుకొని, అనుమతులు రద్దయ్యేలా కృషిచేయాలని కోరారు. అనంతరం 70వ వార్డు పరిధిలో అదాని అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో అసోసియేషన్ మహిళా కమిటీ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న తోకాడ సమైక్య అపార్ట్‌మెంట్ మహిళలు



పాలాభిషేకం చేస్తున్న సోమ కుటుంబ సభ్యులు

చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం

ప్రజాశక్తి-అరకులోయ: మాజీ ఎమ్మెల్యే, ఎస్సీ ఎస్టీ కమిషన్ సివేరి సోమ రెండో కుమారుడు సురేష్ కుమార్‌కు కారుణ్య నియామకం కింద డిప్యూటీ తహసిల్దార్ ఉద్యోగం ప్రభుత్వం ఇవ్వడంతో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఫోటోకు సివేరి సోమ కుటుంబ సభ్యులు, కార్యకర్తలు పాలభిషేకం చేశారు. ఇచ్చిన మాట చంద్రబాబు నాయుడు నిలబెట్టుకున్నారని ఆనందం వ్యక్తం చేశారు. 2018 లో అప్పటి ఎమ్మెల్యే కిడారి సర్వేశ్వరరావు, ఎస్సీ ఎస్టీ కమిషన్ సివేరి సోమలను నక్సల్స్ హతమార్చిన విషయం తెలిసిందే. తామంతా ముఖ్యమంత్రి, చంద్రబాబు, మంత్రి లోకేష్, డిప్యూటీ సి ఎం పవన్ కళ్యాణ్ కి రుణపడి ఉంటామని సివేరి కుటుంబ సభ్యులు అబ్రహం, సురేష్ కుమార్, సోమ భార్య ఇచ్ఛావతి ఇతర కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేసారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, దివంగత నేత సివేరి సోమ తో కలిసి ఉన్న చిత్ర పటానికి సివేరి కుటుంబ సభ్యులతో పాటూ, రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడు కిల్లో సాయిరాం, మాజీ ఉమ్మడి విశాఖ జిల్లా వైస్ చైర్మన్ అప్పారావులు పాలాభిషేకం చేసి తమ ఆనందాన్ని వ్యక్తం చేసారు. ఆ సమయంలో అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మా కుటుంబాన్ని పరామర్శించి ఆదుకుంటామని హామీ ఇచ్చారని, అయితే నాడు ఇచ్చిన హామీ నేడు నెరవేర్చడంతో ఎంతో ఆనందంగా ఉందని చెప్పారు. తెలుగుదేశం పార్టీ బలోపేతానికి తమ వంతు నిరంతరం కృషి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు రమేష్, మాజీ సర్పంచ్ పూర్ణ , అరకులోయ నియోజకవర్గం కు చెందిన ఆరు మండలాల తెలుగుదేశం పార్టీకి చెందిన నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

అప్పన్న నిత్యాన్నప్రసాదానికి విరాళం

ప్రజాశక్తి- వేపగుంట : శ్రీ వరహాలక్ష్మినృసింహ స్వామి నిత్యాన్న ప్రసాదానికి సింహాచలం రాజీవ్ కాలనీకి చెందిన లంకా జయ మౌర్యసాయి రూ.1,00,116 విరాళం అందించారు. దేవస్థానం విరాళ కౌంటర్‌లో నగదు చెల్లించి, రసీదును పొందారు. ప్రోటోకాల్ పర్యవేక్షణ అధికారి సునీల్‌కుమార్ దేవస్థానం తరపున నిత్యాన్నప్రసాద పథకం బాండ్‌ను అందజేశారు. దాతకు దర్శనం కల్పించి వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. స్వామివారి శేష వస్త్రంతో సత్కరించి, శ్రీ వరాహలక్ష్మీ నరసింహస్వామి ప్రసాదాలను భక్తునికి అందజేశారు.

అప్పన్నను దర్శించుకున్న డిజిపి దంపతులు

ప్రజాశక్తి- వేపగుంట : సింహాచలంలోని శ్రీ వరాహలక్ష్మీ నరసింహ స్వామిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డిజిపి)హరీష్ కుమార్ గుప్తా దంపతులు ఆదివారం దర్శించుకున్నారు. దేవస్థానం అధికారులు వారికి సంప్రదాయ పద్ధతిలో స్వాగతం పలికారు. హరీష్ కుమార్ గుప్తా దంపతులు ముందుగా కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. అనంతరం బేడా మండపం చుట్టూ ప్రదక్షిణ చేశారు. ప్రధాన ఆలయంలో స్వామివారి మూలవిరాట్ సన్నిధిలో ఆలయ అర్చకులు డిజిపి దంపతుల గోత్రనామాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం డిజిపి దంపతులను ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారి కె.తిరుమలేశ్వరరావు స్వామివారి శేష వస్త్రంతో సత్కరించి, జ్ఞాపికను ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎడిసిపి కింజరాపు ప్రభాకర్, ఎసిపి పృథ్వీరాజ్, గోపాలపట్నం సిఐ సన్యాసినాయుడు పాల్గొన్నారు.

చలపతికి చింతా నారప్ప స్మృతి పురస్కారం


ప్రజాశక్తి -ములగాడ : విజయవాడ బాలోత్సవ్ భవన్‌లో ఆదివారం జరిగిన ఆర్ట్ అసోసియేషన్ గిల్డ్ మన సంస్కృతి చిత్ర కళా ప్రదర్శన కార్యక్రమంలో కళా రత్నశ్రీ సుంకర చలపతిరావుకు కీర్తిశేషులు చింతా నారప్ప స్మృతి పురస్కారాన్ని మాజీ మంత్రి డాక్టర్ మండలి బుద్ధ ప్రసాద్ చేతులు మీదుగా అందించారు.

అంగన్‌వాడీ, పంచాయతీ భవన నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి- కొయ్యూరు: కొయ్యూరు మండలం పీమాకవరంలో అంగన్‌వాడి కేంద్రం భవనం, బట్టబనుకుల పంచాయతీ భవనం మంజూరయ్యాయి. వాటిని టిడిపి రాష్ట్ర కార్యదర్శి జిసిసి మాజీ చైర్మన్ ఎం.వి.వి.ప్రసాద్ ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపితోనే గిరిజన ప్రాంతం అభివద్ధి జరుగుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు గిరిజన ప్రాంతాలను అభివృద్ధి కేంద్రాలుగా తీర్చిదిద్దాలని గిరిజన ప్రాంతాల్లో అన్ని మౌలిక వసతులు కల్పించాలనే ఉద్దేశంతో గిరిజన ప్రాంతాలను అభివద్ధి పథంలో నడిపిస్తున్నారు. దీనిలో భాగంగా మారుమూల గిరిజన ప్రాంతాల్లో రోడ్లు, తాగునీరు, పంచాయతీలకు నిధులను కేటాయించి అభివద్ధి పథంలో నడుపుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో పి.మాకవరం సర్పంచ్ నూకాలమ్మ, బట్టపనుకుల సర్పంచ్ బాలకృష్ణ టిడిపి మండల అధ్యక్షులు చంద్రరావు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ దుచ్చరి చిట్టిబాబు , మాజీ మండల అధ్యక్షులు లోత భీమరాజు, టిడిపి నాయకులు ఉండా నాగేశ్వరావు, పొత్తూరు దేవుడు పాల్గొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న ఎంవివి.ప్రసాద్



గొల్ల బాబూరావును సన్మానిస్తున్న యూనియన్ సభ్యులు

ఎపిటియు గౌరవ అధ్యక్షునిగా గొల్ల బాబూరావు

ప్రజాశక్తి -విశాఖ కలెక్టరేట్: ఆంధ్రప్రదేశ్ టీచర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ నూతన కార్యవర్గ ఎన్నికలు యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు వై.దేముడు అధ్యక్షతన ఆదివారం జరిగాయి. గౌరవ అధ్యక్షునిగా రాజ్యసభ సభ్యులు గొల్ల బాబురావు ఎన్నికయ్యారు. గొల్ల బాబురావును ఈ సందర్భంగా యూనియన్ ఆధ్వర్యంలో సత్కరించారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర నాయకులు కె. బ్రహ్మారెడ్డి, కె.జె. కృపానందం, గౌరీశంకర్ తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న వైసిపి నాయకులు

కాశీబుగ్గ మృతులకు నివాళి

ప్రజాశక్తి-విశాఖంం కలెక్టరేట్ : శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గలో శ్రీ వెంకటేశ్వర ఆలయంలో జరిగిన తొక్కిసలాట ఘటనలో భక్తులు దుర్మరణం చెందడం పట్ల వారికి సానుభూతి వ్యక్తం చేస్తూ, ఆదివారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద వైసిపి ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో ర్యాలీ చేసి నివాళులర్పించారు. వైసిపి విశాఖపట్నం జిల్లా అధ్యక్షులు,విశాఖ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె రాజు,శాసనమండలి సభ్యురాలు, వైసిపి రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు వరుదు కళ్యాణి, సమన్వయకర్తలు,రాష్ట్ర ,మాజీ జిల్లా వివిధ కార్పొరేషన్ చైర్మన్లు, కార్పొరేటర్లు ,రాష్ట్ర పార్టీ కార్యవర్గం సభ్యులు నగర జిల్లా అనుబంధ విభాగాల అధ్యక్షులు, రాష్ట్ర అనుబంధ విభాగాల కమిటీ సభ్యులు, మాజీ రాష్ట్ర జిల్లా వివిధ కార్పొరేషన్ డైరెక్టర్, వార్డు అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

కడలి కాదు ఇది...పుడమి సింగారం



ఎత్తైన కొండలు, జాలు వారే జలపాతాలు, లోతైన లోయలు వాటి నడుమ పాలనురుగు లాంటి మేఘమాలికలు.. వాహ్..ఇటువంటి ప్రకృతికి పరవశించని మనస్సు, మైమరచిపోని మనిషి ఉండడు. జీకే వీధి మండలం దారకొండ ఘాట్ రోడ్లో ఆదివారం ఈ ప్రకృతి అందాలు చూపరులను ఆకట్టుకున్నాయి. పలువురు పర్యాటకులు దారాలమ్మ అమ్మవారిని దర్శించుకోవ డానికి అధిక సంఖ్యలో తరలివచ్చారు. అమ్మవారిని దర్శించుకుని మన్యంలో దశ్యాలు తిలకించి మంత్రముగ్ధులయ్యారు.

- ప్రజాశక్తి - సీలేరు

వర్షమొస్తే అంతే సంగతులు

- శిథిలావస్థలో దేవరాపల్లి బిసి వసతి గృహం
- కారుతున్న గదులు.. ఊడిపోయిన కిటికీలు
- విద్యార్థులకు పాములు, విషపురుగుల భయం

ప్రజాశక్తి - దేవరాపల్లి (అనకాపల్లి)

వర్షం వస్తే అక్కడి విద్యార్థులు బితుకుబితుకు మనడమే. శీతాకాలమైతే గజగజ వణకడమే. మల, మూత్ర విసర్జనలకు ఆరుబయటకు వెళ్లాల్సిందే. ఇవీ అనకాపల్లి జిల్లా దేవరాపల్లి మండల కేంద్రంలోని బిసి వసతి గృహ విద్యార్థుల దయనీయ పరిస్థితి. ఈ వసతి గృహంలో 71 మంది విద్యార్థులు ఉన్నారు. వారికి మూడే బాత్రూంలు, నాలుగు స్నానపు గదులే ఉన్నాయి. వాటిలోనూ సరైన సదుపాయాలు లేకపోవడంతో వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.



బీటలు వారిన వసతిగృహ భవనం

వసతిగృహభవనం శిథిలావస్థకు చేరుకుంది. నాలుగు గదుల్లో రెండు పూర్తిగా శిథిల దశకు చేరాయి. వర్షం వస్తే కారిపోతున్నాయి. గదుల్లోని కిటికీలు పూర్తిగా పోవడంతో చలికాలం విద్యార్థులు వణికిపోతున్నారు. విష పురుగులు, పాములు వస్తాయేమోనన్న భయాందోళన వారిని నిత్యం వెంటాడుతోంది. గతంలో హాస్టల్లో తొమ్మిది బాత్రూములు ఉండేవి. అవి పూర్తిగా శిథిలావస్థకు చేరుకోవడంతో వాటిలో ఆరింటిని నెలరోజుల క్రితం పూర్తిగా తొలగించారు. పునర్నిర్మాణం చేపట్టలేదు. విద్యార్థులు బట్టలు ఉతుక్కోవడానికి సరైన సదుపాయాలు కరువయ్యాయి. ప్రహరీ గోడ పడిపోయి ఏడాది దాటుతున్నా పట్టించుకున్న నాథుడే లేడు. 71 మంది విద్యార్థులు పడుకోవటానికి 18 బెడ్లు మాత్రమే ఉండటంతో ఎక్కువమంది నేలపైనే పడుకుంటున్నారు. ప్రభుత్వాలు మారుతున్నా ఈ హాస్టల్ దుస్థితి మారడం లేదని పలువురు విమర్శిస్తున్నారు. విద్యార్థులు ప్రతిరోజూ నరకయాతన అనుభవిస్తున్నా ఎవ్వరికీ పట్టడం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.



పునర్నిర్మాణానికి నోచుకోని మరుగుదొడ్లు